# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అసోంలో 23 వేల 550 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

- భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, విద్యార్థులే కీలక భాగస్వాములని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు.

- పంజాబ్‌లో అధికారంలోకి వస్తే.. రెండేళ్లలో మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.

- దేశంలో పెట్రోల్, డీజిల్, ముడిచమురు నిల్వలు సరిపడా ఉన్నాయని, ఇంధన కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ స్పష్టం చేశారు.

- మైనారిటీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు అసోంలోని సిల్చర్‌లో 23 వేల 550 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అంబికాపూర్‌లో మూడు ప్రధాన ప్రాజెక్టులకు భూమి పూజ నిర్వహించారు. వీటిలో 22 వేల 864 కోట్ల రూపాయల ఖర్చుతో సిల్చర్ హై-స్పీడ్ కారిడార్, 565 కోట్ల రూపాయలతో సిల్చర్ టౌన్ ఫ్లైఓవర్, 122 కోట్ల రూపాయలతో పాతర్కండి వ్యవసాయ కళాశాల ఉన్నాయి. ఈ సందర్భంగా బహిరంగ సభను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ... దక్షిణ అసోంలోని బరాక్ వ్యాలీ ఇప్పుడు భారతదేశాన్ని ఆగ్నేయాసియాతో అనుసంధానించే కీలక వారధిగా ఎదుగుతోందని తెలిపారు. నేడు ఈశాన్య భారతదేశం 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి నాయకత్వం వహిస్తోందని అన్నారు. సిల్చార్ - షిల్లాంగ్ హై - స్పీడ్ కారిడార్ పూర్తయితే మేఘాలయ, అసోం మధ్య అనుసంధానం పెరగడమే కాకుండా మిజోరం, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాలకు రవాణా సులభతరం

అవుతుందన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం భారత పౌరులపై పడకుండా ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని తెలిపారు. దేశ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరేంద్రమోదీ పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రక్షణ రంగంలో హిమాచల్ ప్రదేశ్ అందిస్తున్న సేవలు అమోఘమని, భారత సాయుధ దళాల్లో ఈ రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కొనియాడారు. ధర్మశాలలో ఈరోజు జరిగిన హిమాచల్ ప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం 9వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ… విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉండాలని సూచించారు. ప్రపంచ స్థాయిలో మన ఉన్నత విద్యావ్యవస్థ పోటీ పడాలంటే విద్యాసంస్థల మధ్య సమన్వయం, సహకారం పెరగాలని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, విద్యార్థులే కీలక భాగస్వాములని ఉపరాష్ట్రపతి ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌తో పాటు తూర్పు భారత ముఖచిత్రాన్ని మార్చేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు కోల్‌కతాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సుమారు 18 వేల 680 కోట్ల రూపాయల విలువైన పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ప్రధాని.. ఈ సందర్భంగా మాట్లాడుతూ… ఈ పథకాలు కేవలం బెంగాల్‌కే కాకుండా యావత్ తూర్పు ప్రాంత పారిశ్రామిక, వాణిజ్య వృద్ధికి నూతన జవజీవాలను అందిస్తాయని ఆకాంక్షించారు. మౌలిక సదుపాయాల బలోపేతమే ధ్యేయంగా 16 వేల 990 కోట్ల రూపాయలతో సుమారు 420 కిలో మీటర్ల పొడవైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలను కలుపుతూ పురూలియా-ఆనంద్ విహార్ (ఢిల్లీ) ఎక్స్‌ప్రెస్‌ను నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ… ఖరగ్‌పూర్-మోర్‌గ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వే ఈ ప్రాంత ఆర్థిక గమనాన్ని మారుస్తుందని తెలిపారు. ఓడరేవుల యాంత్రీకరణ ద్వారా వాణిజ్యం వేగవంతమై లక్షలాది మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తూర్పు భారత అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధానమంత్ర పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంధన కొరతపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని, సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని సామాజిక మాధ్యమం వేదికగా భరోసా ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డీలర్లు ఇంధనం పంపిణీ చేసే సమయంలో భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. ఏవైనా ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మైనారిటీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలన్నీ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అమలవుతున్నాయని రిజిజు పేర్కొన్నారు. ముఖ్యంగా సమాజంలో

వెనుకబడిన, స్వల్ప సంఖ్యలో ఉన్న వర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కేలా చూస్తున్నామని వివరించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కిరణ్ రిజిజు పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ జెండాలు ఉన్న రెండు ఎల్పీజీ నౌకలు ఈరోజు సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా వెల్లడించారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖల పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఈ నౌకల్లో మొత్తం 92 వేల 700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ (LPG) ఉందని, ఈ నెల 16, 17వ తేదీల్లో ఈ నౌకలు భారత్ కు చేరుకునే అవకాశం వుందని వెల్లడించారు. పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ మాట్లాడుతూ... దేశంలో పెట్రోల్, డీజిల్, ముడిచమురు నిల్వలు సరిపడా ఉన్నాయని, ఎక్కడా ఇంధన కొరత లేదని స్పష్టం చేశారు. గృహ వినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తెస్తే.. కేవలం రెండేళ్లలోనే మాదకద్రవ్యాల (Drugs) రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, అక్రమ మత మార్పిడులను అరికట్టేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తెస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అమిత్ షా ఈరోజు మోగా జిల్లా వేదికగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. జిల్లాలోని కిల్లీ చహ్లాన్ గ్రామంలో జరిగిన 'బద్లావ్ ర్యాలీ'లో ఆయన ప్రసంగించారు. పంజాబ్ ప్రజలు అభివృద్ధిని, స్థిరత్వాన్ని కోరుకుంటున్నారని, తమకు నిజాయితీగా సేవ చేసే ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గత నాలుగేళ్లలోనే అత్యధిక వారాంత పతనాన్ని నమోదు చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఈ వారం 4 వేల 355 పాయింట్లు క్షీణించి శుక్రవారం 74 వేల 564 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 1,299 పాయింట్లు క్షీణించి 23 వేల 151 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 4.5 శాతం తగ్గగా, బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 3.6 శాతం పతనమైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్‌లో రేపటి వరకు వేడి గాలుల పరిస్థితులు కొనసాగనున్నాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. అరుణాచల్ ప్రదేశ్, అస్సోం, మేఘాలయలో రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =